సాక్షి నిర్మల్

శనివారం । 11 । మే । 2024



ఓటుకు సెలవివ్వొద్దు..!

లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఈనెల 13న పోలింగ్ రోజు సెలవు దినంగా భావించకుండా ఓటెయ్యాలని ప్రజాస్వామ్యవాదులు సూచిస్తున్నారు. 2లో▸

అన్నదాతకే తొలి ప్రాధాన్యత



తనను ఎంపీగా గెలిపిస్తే అన్నదాత సంక్షేమానికే తొలి ప్రాధాన్యం ఇస్తానని బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు. 2లో▸

గరిష్టం/కనిష్టం
39.7 /28.5

వాతావరణం

చాలావరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. వేడి, ఉక్కపోత పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



డొంగుర్‌గాం డీసీఎంఎస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఏవో అంజిప్రసాద్

నర్సాపూర్(జి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఏవో అంజిప్రసాద్ సూచించారు. మండలంలోని డొంగురుగావ్, చాక్‌పల్లిలోని డీసీఎంఎస్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. నిబంధనల మేరకు ధాన్యం తూకం వేయాలని తెలిపారు. అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపినందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా చూడాలని డీఏవోను కోరారు. ఆయన వెంట క్లస్టర్ ఏఈవో రమ్య, సెంటర్ నిర్వాహకుడు జంగిపల్లి సంతోష్, రైతులు ఉన్నారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్

భైంసాటౌన్: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలట్ అవకాశం కల్పించింది. ఈ మేరకు ఉద్యోగులు పోస్టల్ బ్యాలట్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఈనెల 3 నుంచి ఆయా పోస్టల్ బ్యాలట్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ చేపట్టింది. శుక్రవారంతో గడువు ముగిసింది. ముధోల్ నియోజకవర్గానికి సంబంధించి భైంసాలోని ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలట్ కేంద్రం ఏర్పాటు చేయగా, మొత్తం 1,675 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,,521 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఏఆర్‌వో కోమల్‌రెడ్డి తెలిపారు. 154 మంది వివిధ కారణాలతో ఓటు వేయలేదు.

పనులు త్వరగా పూర్తి చేయండి



పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో గోవింద్

సోన్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ సీఈవో గోవింద్ సూచించారు. సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు, విద్యుత్ మరమ్మతు పనులు పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన పనులు ఎన్నికల అనంతరం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో సురేశ్, ఏపీవో మంజులారెడ్డి, కార్యదర్శి సంధ్యారెడి, గోపిగౌడ్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్లు అనుపలక్ష్మి, కొమిరే స్వప్న ఉన్నారు.

ఖానాపూర్‌లో రాత్రి భోజనం చేసిన కేటీఆర్



కేటీఆర్‌కు భోజనం వడ్డిస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం భైంసా, నిర్మల్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌ల అనంతరం తిరుగుప్రయాణంలో ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్యా జాన్సన్‌నాయక్‌తోపాటు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వాగతం పలికారు. కాసేపు ఎన్నికలపై చర్చించారు. అనంతరం ఇక్కడే రాత్రి భోజనం చేసి 11 గంటల ప్రాంతంలో హైదరాబాద్ వెళ్లిపోయారు. కేటీఆర్ కోసం ఆయన మిత్రుడు జాన్సన్‌నాయక్ ప్రత్యేక వంటకాలు చేయించారు.

కమలం జోరు.. కాంగ్రెస్ హోరు..

- జిల్లా కేంద్రంలో రెండు పార్టీల ర్యాలీలు
- ఎదురు పడడంతో స్వల్ప ఉద్రిక్తత
- పోటాపోటీగా కార్యకర్తల నినాదాలు



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు



కాంగ్రెస్ ప్రచార ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు

నిర్మల్/నిర్మల్‌టౌన్: పార్లమెంట్ పోరు జిల్లాలో శుక్రవారం ఒక్కసారిగా హీటెక్కింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీలు చేపట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. శుక్రవారం సాయంత్రం రెండు పార్టీలు ర్యాలీ తీశాయి. పురవీధులు రెండు పార్టీల నినాదాలతో హోరెత్తాయి. ప్రచారానికి ఇంకా కొన్ని గంటలే ఉండడంతో రెండు పార్టీలూ భారీ ర్యాలీలతో బల ప్రదర్శన చేశాయి. ఈక్రమంలో ఒకచోట రెండు ర్యాలీలూ ఎదురు పడడంతో ఉద్రిక్తంగా మారింది. కాంగ్రెస్, కమలం పార్టీల కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేసుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలను అదుపు చేశారు. ఉద్రిక్తత తగ్గించారు. బీజేపీ ర్యాలీలో ఎంపీ అభ్యర్థి నగేశ్, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ బైక్‌ర్యాలీలో మంత్రి సీతక్క, పార్టీ నేతలు బెల్లయ్యనాయక్, రాములునాయక్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఉన్నారు.

• బీజేపీకి ఓటేద్దాం.. మోదీని గెలిపిద్దాం..



ర్యాలీలో ఎంపీ అభ్యర్థి నగేశ్, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

కేంద్రంలో మళ్లీ నరేంద్ర మోదీ ప్రభుత్వం రావాలంటే బీజేపీకి ఓటేద్దామని ఎంపీ అభ్యర్థి నగేశ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మహేశ్వర్‌రెడ్డి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో అవినీతిరహిత ప్రభుత్వం కోసం మళ్లీ కమలం గుర్తుకు ఓటేయాలని వారు పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలో ఉన్నంతకాలం రిజర్వేషన్లకు ఢోకా ఉండదన్నారు. రాష్ట్రంలో మెజార్టీ స్థానాలు గెలిచి ముఖ్యమంత్రి మెడలు వంచి పనులు చేయిస్తామన్నారు. ర్యాలీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్, సీనియర్‌నేత సత్యనారాయణగౌడ్, భారీసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

• ఆడబిడ్డను ఆశీర్వదించండి..



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఆదిలాబాద్ పార్లమెంట్ నుంచి తొలిసారి పోటీచేస్తున్న ఆదివాసీ ఆడబిడ్డ, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కోరారు. కాంగ్రెస్ బైక్ ర్యాలీ జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ప్రారంభమైంది. మధ్యలో పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ మాటలు చెప్పే మోదీ సర్కారు వద్దని, ఇక చేతల్లో అభివృద్ధిని చూపే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపిద్దామన్నారు. తాము సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ర్యాలీకి అనుమతి తీసుకున్నామన్నారు. బీజేపీ పోటీగా ర్యాలీ తీయడం దారుణమని పేర్కొన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆడబిడ్డకు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరారు. ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, అధికసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్



వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ఏర్పాట్లపై కలెక్టర్లు, అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అన్నిరకాల స్క్వాడ్ సిబ్బందిని మరింత అప్రమత్తంగా చేయాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు మీడియా మానిటరింగ్ అండ్ సర్టిఫికేషన్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశించిన మార్గాల్లో మాత్రమే రూట్ ఆఫీసర్ల సమక్షంలో ఈవీఎం యంత్రాల తరలించాలన్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పోలింగ్ సామగ్రి తరలింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ శాతం రిపోర్టులను సమయానికి పంపాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం వెబ్ కాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల నోడల్ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్వో భుజంగరావ్, ఆర్డీవో రత్నాకళ్యాణి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీఆర్వో విష్ణువర్ధన్, డీపీవో శ్రీనివాస్, ఇతర జిల్లా నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట నిఘా

ఈవీఎం స్ట్రాంగ్ రూంల వద్ద నిరంతరం పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్ రూం తలుపులు తెరిచి, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంలోకి పోలీసు బందోబస్తుతో తరలించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈవీఎం గోదాంకు సీల్ వేశారు. స్ట్రాంగ్ రూంల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాస్, నాయకులు శ్రావణ్‌రెడ్డి, రవికుమార్, గంధ్రత్ రమేశ్, సిరికొండ రమేశ్, ఎంబడి రాజేశ్వర్ పాల్గొన్నారు.

జిల్లాకు చేరుకున్న పోలీసు బలగాలు



జిల్లా కేంద్రానికి చేరుకున్న పోలీసు బలగాలు

నిర్మల్‌టౌన్: ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన బీఎస్‌ఎఫ్ బలగాలు శుక్రవారం రాత్రి నిర్మల్‌కు చేరుకున్నాయి. అంతేకాకుండా పలు జిల్లాల నుంచి సుమారు 1000 మంది సిబ్బంది ఎన్నికల్లో విధులు నిర్వహించనున్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఎన్నికల విధులపై డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ అనిల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ గంగారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో పట్టణ సీఐ అనిల్, బీఎస్‌ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

ప్రతీ హామీ అమలు చేస్తాం

- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు



పొన్కల్‌లో కూలీలతో మాట్లాడుతున్న శ్రీహరిరావు

మామడ: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని పరిమండల్, పొన్కల్, పోతారం, బండలఖానాపూర్ గ్రామాలలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున ప్రచారం నిర్వహించారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉపాధిహామీ కూలీలకు రోజు వేతనం రూ.400 చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జైసింగ్, సంతోష్, రమణారెడ్డి, లింగారెడ్డి, శేఖర్, లింగన్న, గంగారెడ్డి, నర్సారెడ్డి, అజాం, బాపయ్య, రఫీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో..

మండలంలోని నల్దుర్తి, దిమ్మదుర్తి, కప్పన్‌పల్లి, పొన్కల్ గ్రామాల్లో సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి రాజేశ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సత్తన్న, చిన్నరాజన్న, రవి, రాజమణి, బక్కన్న పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- ఎస్పీ జానకీషర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

భైంసాటౌన్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ జానకీషర్మిల హెచ్చరించారు. భైంసాలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. గురువారం భైంసాలో కేటీఆర్‌పై దాడి ఘటనకు సంబంధించి వీడియో ఫుటేజ్ ఆధారంగా 23 మందిని గుర్తించామన్నారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేశామని తెలిపారు. నలుగురిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. భైంసాలో ప్రశాంత వాతవరణం ఉందని, నిరంతర పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. రెచ్చగొట్టే పుకార్లను నమ్మొద్దని, సంయమనం పాటించాలని సూచించారు. సమావేశంలో పట్టణ సీఐ డి.రాజారెడ్డి ఉన్నారు.

'హనుమాన్ స్వాముల అరెస్ట్ సరికాదు'

కేటీఆర్ రోడ్‌షో సందర్భంగా శాంతియుతంగా నిరసన తెలిపిన హనుమాన్ స్వాములను అరెస్ట్ చేయడాన్ని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్ ఖండించారు. పట్టణంలోని ఎస్‌ఎస్ కాటన్‌లో శుక్రవారం మాట్లాడారు. హిందువుల మనోభావాలు దెబ్బతీయడంతోపాటు, పోలీసులను కించపరిచేలా మాట్లాడిన కేటీఆర్‌పై చర్య తీసుకోకుండా, మాలధారణలో ఉన్న స్వాములను అర్ధరాత్రి అరెస్ట్ చేయడమేంటని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని బీఆర్‌ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలకు భయం పట్టుకుందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిపాండే, అసెంబ్లీ సంయుక్త కన్వీనర్ సుమన్, నాయకులు బాలాజీ సూత్రావే, రావుల పోశెట్టి, దశరథ్ ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

- మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్/సారంగపూర్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరుగ్యారంటీల హామీ ఇచ్చి, ఐదింటిని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. పదేళ్లలో బీజేపీ చేసిందేమీ లేదని విమర్శించారు. నిర్మల్ ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో అర్బన్ కార్యకర్తలతో, సారంగాపూర్‌లోని అల్లోల మురళీధర్‌రెడ్డి కాంప్లెక్స్‌లో మండల కార్యకర్తలు, ముఖ్య నాయకులతో శుక్రవారం వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి సంపదను బహుళజాతి కంపెనీలకు దోచిపెడుతోందని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదల బతుకులు బాగుపడతాయన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఓనిరుపేద గిరిజన మహిళ ఆత్రం సుగుణను పార్టీ అభ్యర్థిగా నిలబెట్టామని తెలిపారు. ఆశీర్వదించాలని కోరారు. ఇచ్చిన గ్యారంటీలతోపాటు అభివృద్ధికిపాటుపడే కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లోనూ గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు అల్లూరి మల్లారెడ్డి, రామలింగం, ధర్మాజీ రాజేందర్, పాకాల రాంచందర్, అయిర నారాయణరెడ్డి, నల్ల వెంకట్రామిరెడ్డి, మోకుదెబ్బ నాయకులు నర్సాగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



కళేబరాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో విద్యుత్ ఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందింది. గురువారం రాత్రి ఈదురుగాలులు వీయడంతో చెట్టు విగిరి గ్రామంలో ని 11 కేవీ విద్యుత్ తీగలపై పడింది. దీంతో తీగలు తెగిపడ్డాయి. గ్రామానికి చెందిన రైతు షేక్ చాంద్‌పాషా శుక్రవారం ఉదయం ఎడ్లను తన పొలం వద్దకు తీసుకెళ్తుండగా తెగిన విద్యుత్ తీగ ఓ ఎద్దుకు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. అప్రమత్తమై రైతు విద్యుత్ తీగను కర్రసాయంతో పక్కకు జరపడంతో మరో ఎద్దు ప్రాణా పాయం నుంచి బయటపడింది. రూ.40 వేల విలువైన ఎద్దు మృతిచెందిందని ప్రభుత్వ ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నడు. ఘటన స్థలానికి ఏఈ యశ్వంత్‌తోపాటు లైన్‌మెన్ నరేశ్ చేరుకుని పరిశీలించారు.

మద్యం పట్టివేత.. ఇద్దరిపై కేసు

నేరడిగొండ: మండలంలోని సవర్గాం గ్రామంలో ఇద్దరు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన విఠల్, జాదవ్ సుధాకర్ వద్ద మద్యం లభించింది. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా మద్యం అక్రమంగా అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తిర్పెల్లి వైన్స్ సమీపంలో తిర్పెల్లికి చెందిన రాకేశ్ తన స్నేహితులకు జైశ్రీరామ్ అని చెప్పడంతో పక్కన ఉన్న ఓ వర్గానికి చెందిన వ్యక్తి, అతడి స్నేహితులు అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాల్‌సింగ్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో 7.0 జీపీఏకు పైబడి ఫలితాలు సాధించిన ఎస్టీ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 30లోపు www.telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వృద్ధుడి మృతి

ఆదిలాబాద్‌టౌన్: బేల మండల కేంద్రానికి చెందిన కనాకే మారుతి (65) ఆదిలాబాద్ పట్టణంలో కొంత కాలంగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో రిమ్స్ ఎదుట గల అమ్మ హోటల్ ఎదుట కిందపడి మృతిచెందాడు. కొద్ది రోజులుగా ఆహారం లేక, వడదెబ్బకు గురై మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జిన్నింగ్ ఫ్యాక్టరీలో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని టూటౌన్ ఏరియాలో గల సాయిబాబా జిన్నింగ్ ఫ్యాక్టరీలో శుక్రవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు వెయిట్ లిఫ్టింగ్ మిషన్‌లోని పరికరాలను ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.40వేల వరకు ఉంటుందని టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ తెలిపారు. జిన్నింగ్ మిల్లు సూపర్‌వైజర్ గంగారాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఓటుకు సెలవివ్వొద్దు..!



- ఓటుహక్కును బాధ్యతగా భావించాలి
- ప్రజాస్వామ్యంలో యువచైతన్యం కీలకమే..
- గత లోక్‌సభ ఎన్నికల్లో 71.42 శాతం నమోదు..

నిర్మల్‌ఖిల్లా: లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం వాడివేడిగా కొనసాగుతోంది. నేటి సాయంత్రం ప్రచారం ముగియనుంది. మరోవైపు పోలింగ్ పెంచేందుకు అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటర్ల భాగస్వామ్యం కీలకమని, అలాంటి ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. పోలింగ్ రోజును సెలవు దినంగా భావించకుండా, మన పాలకులను ఎన్నుకునే అస్త్రంగా భావించాలని సూచిస్తున్నారు.

ఓటు హక్కు వినియోగించుకునేందుకే..

ప్రతీ పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలనే లక్ష్యంతో పోలింగ్ రోజున ఎలక్షన్ కమిషన్ సెలవును కూడా ప్రకటించింది. ఈ నెల 13 సెలవు దినం. అంతకు ముందు రోజు ఆదివారంసహా రెండో శనివారం కూడా వస్తోంది. ఇలా వరుసగా మూడు రోజులు సెలవులు వస్తున్నాయి. పోలింగ్ రోజును సెలవు దినంగా భావిస్తే ఎన్నికల మహాక్రతువుకు విఘాతం కలిగే అవకాశం ఉంటుంది. పోలింగ్ రోజున ఇంటి వద్దనే ఉండి అమూల్యమైన ఓటు హక్కును సమీప పోలింగ్‌కేంద్రంలో వినియోగించుకోవాలి.

పోలింగ్ సమయం పెంపు..

ఈసారి పోలింగ్ సమయాన్ని గంటపాటు పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉన్న పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6 గంటల వరకు కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేసింది.

గత ఎన్నికల ఓటింగ్ శాతాన్ని దాటేలా..

ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 2019 ఎన్నికల్లో 71.42 శాతం పోలింగ్ నమోదయింది ఈసారి అంతకుమించి పోలింగ్ పెంచేలా అధికారులు కృషి చేస్తున్నారు. ఇందుకుగాను ఓటు హక్కు కలిగిన అందరూ పోలింగ్ కేంద్రానికి వచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

యువతరానిదే కీలక పాత్రే...

రాజ్యాంగంలో విశిష్టతను సంతరించుకున్న ఓటు హక్కును వినియోగించుకోవడంలో యువత కీలక పాత్ర పోషించాలి. ఉద్యోగ, ఉపాధి అవసరాల కోసం చాలామంది స్వస్థలాలకు దూరంగా హైదరాబాద్, వరంగల్, ముంబై తదితర పట్టణ నగర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. ఉన్నతచదువుల నిమిత్తం హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు వంటి నగరాల్లో ఉంటున్నారు. ఈసారి పోలింగ్ రోజు కంటే ముందే తమ స్వస్థలాలకు చేరుకున్నారు. రెండో శనివారం, ఆదివారం పోలింగ్ రోజైన సోమవారం వరుస సెలవు రావడంతో స్వగ్రామాలకు వచ్చేశారు. యువ ఓటర్లు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

రాజ్యాంగం ఇచ్చిన ఆయుధం..



సువిశాల దేశపు రాజ్యాంగంలో ఓటు హక్కు అనేది దేశ పౌరులకు అందించిన గొప్ప ఆయుధం. మంచి పాలకులను ఎన్నుకునేందుకు ఓటు అనే అస్త్రం మనకు ఉపయోగపడుతుంది. ఓటు హక్కు వినియోగించుకోవడంలో అలసత్వాన్ని ప్రదర్శించవద్దు. ప్రజాస్వామ్యయుతంగా నచ్చిన వ్యక్తికి ఓటు వేసి మన బాధ్యతను నిర్వర్తించాలి. మరో నలుగురు ఓటువేసేలా చైతన్యపరచాలి.

– డాక్టర్ చక్రధారి, చిన్నపిల్లల వైద్యనిపుణులు, ప్రముఖ కవి, నిర్మల్

ఓటు ఒక చైతన్య దీపిక...



దేశ రాజకీయాలను శాసించే పాలకులను ఎన్నుకునే అవకాశం కేవలం ఓటర్ల చేతుల్లోనే ఉంటుంది. దేశ పురోగతికి దశదిశను నిర్దేశించే నాయకుడిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఓటు హక్కు ద్వారానే కలుగుతుంది. అలాంటి హక్కును వినియోగించుకోవడంలో అలసత్వం ప్రదర్శించొద్దు. ఓటుహక్కు ప్రజల చేతిలో ఒక చైతన్యదీపికగా భావించాలి. ఓటు ప్రాధాన్యతను తెలిపేలా రచనలు చేసి నావంతుగా చైతన్యపరుస్తున్నాను.

– అంబటి నారాయణ, కవి, సాహితీవేత్త, నిర్మల్

బీజేపీకి ఓటమి భయం

- కేటీఆర్‌పై దాడిని ఖండిస్తున్నాం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయంతో మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. భైంసాలో నిర్వహించిన రోడ్‌షోలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేసిన దాడిని ఖండిస్తున్నామని అన్నారు. రెచ్చగొట్టి, మతాల మధ్య చిచ్చుపెట్టి గెలవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆంజనేయ భక్తులను తాము గౌరవిస్తామని, అయితే ఈ దాడికి పాల్పడింది భక్తుల వేషధారణలో ఉన్న బీజేపీ నాయకులు అని అన్నారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్ భైంసా మున్సిపల్ చైర్మన్ ఎన్నికల సమయంలో ఎంఐఎంకు ఓటు వేసిన మాట వాస్తవం కాదా అని అన్నారు. ఈ విషయాన్ని హిందు సంఘాలు ఏవిధంగా సమర్థిస్తాయని ప్రశ్నించారు. తమ పార్టీ అన్ని మతాలకు సమాన గౌరవం ఇస్తుందన్నారు. ఎంపీ అభ్యర్థి సక్కు మాట్లాడుతూ ఎన్నికల వేళ బీజేపీ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తాను హనుమాన్ ఆలయాన్ని దర్శించుకొని నామినేషన్ వేసినట్లు గుర్తు చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు అజయ్, రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, భూమన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో కత్తిపోట్ల కలకలం

- ఒకరు మృతి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని చిక్కడ్‌పల్లికి చెందిన జీషాన్ బుధవార్‌పేట్‌కు చెందిన మతిన్ ఇద్దరు స్నేహితులు. రాంనగర్ ప్రాంతానికి చెందిన సుమేర్ వీరికి తెలిసిన వ్యక్తి. వ్యక్తిగతంగా ఏదో విషయం గురించి మాట్లాడుకుందామని మతిన్‌ను సుమేర్ పిలిచాడు. మినీ ట్యాంక్‌బండ్ వద్దకు రావాలని కోరారు. దీంతో మతిన్ తన స్నేహితుడు జీషాన్‌ను తీసుకుని శుక్రవారం సాయంత్రం వెళ్లాడు. ఆ సమయంలో వారిమధ్య మాటా.. మాట పెరిగి ఘర్షణ జరిగింది. దీంతో సుమేర్ తన వద్ద ఉన్న కత్తితో మతిన్, జీషాన్‌పై దాడిచేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జీషాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మతిన్‌కు ప్రాథమిక చికిత్స చేసి హైదరాబాద్‌కు తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం. ప్రేమ వ్యవహారమే ఈ దాడికి కారణమని అనుమానిస్తున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

మోదీని మూడోసారి ప్రధాని చేయాలి

- ఉద్యమంతోనే ముగ్గురు ఆదివాసీలకు టికెట్లు
- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్‌టౌన్: నరేంద్ర మోదీని మూడోసారి ప్రధాని చేయాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రధాన పార్టీలన్నీ ఆదివాసీ ఉద్యమాన్ని గౌరవించి ముగ్గురు అభ్యర్థులకు టికెట్లు కేటాయించారని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సర్వే పూర్తయిందని, ఆదిలాబాద్‌లో పిట్‌లైన్ మంజూరు చేసి పనులు జరుగుతున్నాయన్నారు. పీటీజీ తెగలను గుర్తించి నిధులు కేటాయించారని పేర్కొన్నారు. కాగా ఈ సమావేశంలో ఆయన బీజేపీ ఎంపీ అభ్యర్థి పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం. ముందుగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. హిందువులపై దాడులు చేస్తున్నారని, గత ప్రభుత్వ హయాంలోనే కాకుండా ప్రస్తుత కాంగ్రెస్ హయాంలోనూ దాడులు కొనసాగుతున్నాయన్నారు. భైంసా సంఘటనను ఆయన ఖండించారు. ప్రజలు మోదీ వైపు ఉన్నారని, హిందువులపై దాడి చేస్తే సహించేది లేదన్నారు. గొడం నగేశ్‌కు మద్దతు తెలిపి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ పార్లమెంట్ ప్రభారి అల్జాపురే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రచార వాహనం బోల్తా



బోల్తాపడిన బీఆర్‌ఎస్ ప్రచార వాహనం

బోథ్: మండలంలోని ధన్నూర్ (బి)– నాగాపూర్ గ్రామాల మధ్య బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రచార వాహనం శుక్రవారం అదుపుతప్పి బోల్తా పడింది. ఓ వాహనాన్ని తప్పించబోయి రోడ్డు దిగడంతో అదుపుతప్పినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

అన్నదాత సంక్షేమానికే తొలి ప్రాధాన్యత

- యువతకు ఉపాధి కల్పించేలా పరిశ్రమలు తీసుకొస్తా
- ఆదిమ గిరిజనుల వికాసానికి కృషి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: ఈ ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే అన్నదాత సంక్షేమానికే తొలి ప్రాధాన్యం ఇస్తానని బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో వృత్తి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలతోపాటు సాంకేతిక విద్య అందించేలా చర్యలు చేపడతానని చెప్పారు. టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి పరిశ్రమలతోపాటు ఆసిఫాబాద్, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో పీజీ కళాశాలల ఏర్పాటుపై శ్రద్ధ వహిస్తానని తెలిపారు. అంతేకాకుండా ఆదిమ గిరిజనుల వికాసానికి కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

సాక్షి: మీ ప్రచారం ఎలా సాగుతోంది.. ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

సక్కు: పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, కేసీఆర్ కిట్, 24 గంటల విద్యుత్ సరఫరా, రైతు భరోసా వంటి పథకాలతో లబ్ధి పొందిన ప్రజలు నన్ను ఆదరిస్తున్నారు.

సాక్షి: ఓటర్లు మీకే ఎందుకు మద్దతు ఇవ్వాలనుకుంటున్నారు?

సక్కు: నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో తమ పార్టీ తనను మొదట అభ్యర్థిగా ప్రకటించింది. బీజేపీ, కాంగ్రెస్‌లకు అభ్యర్థులు దొరక్క పార్టీలో కనీసం ప్రాథమిక సభ్యత్వం లేని వ్యక్తులను తీసుకొచ్చి టికెట్లు ఇచ్చారు. దీన్నిబట్టి ఆదివాసీల కోసం పనిచేసే వ్యక్తి ఎవరో ప్రజలకు అర్థమైంది. ఆదివాసీల హక్కులు, చట్టాల కోసం పోరాడిన వ్యక్తిగా తనకు సంపూర్ణ మద్దతు లభిస్తుంది.

సాక్షి: రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా.. ఆదివాసీల కోసం ఏమీ చేయలేదనే విమర్శలు ఉన్నాయి. దీనిపై మీ స్పందన..?

సక్కు: 2009లో ఎమ్మెల్యేగా గెలిచాక ప్రతీ ఆదివాసీ గూడెంలో పర్యటించా. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు, జీవో 3 కారణంగా కోల్పోయే ఉద్యోగ అవకాశాలపై తొలిసారిగా మాట్లాడిన వ్యక్తి నేనే. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల వసతి కల్పించాను. ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యేనైనా ఆదివాసీల కోసం మాట్లాడి పని చేశారా. కుమురంభీం పేరిట స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తున్నా. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఏమీ చెప్పుకోలేక తనపై దుష్ప్రచారం చేస్తున్నారు.

సాక్షి: గెలిస్తే నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధికి కృషి చేస్తారు. మీకున్న ప్రాధాన్యాలేంటి..?

సక్కు: పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 90 శాతం మంది రైతులు వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, సిర్పూర్(టి) నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో రెండో పంట వేసే అవకాశం లేక రైతులు ఏప్రిల్ నుంచి ఖాళీగానే ఉంటున్నారు. అలాంటి రైతులు రెండో పంటను పండించేలా గిరి వికాసం ద్వారా బోరుబావులు, త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడమే తొలి ప్రాధాన్యతగా భావిస్తాను. రేపటి తరాలు బాగు పడాలంటే చదువే కీలకం. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతోపాటు మాతా శిశు మరణాలు జరగకుండా ప్రత్యేక కృషి చేస్తాను.

సాక్షి: యువతకు ఉపాధి కల్పించేలా ఎలాంటి చర్యలు చేపడతారు..?

సక్కు: సాధారణ చదువుతోపాటు వృత్తి నైపుణ్యంతో కూడిన కోర్సులు చదివేలా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో కేంద్రాలను ఏర్పాటు చేయిస్తా. జిల్లా కేంద్రంలో పీజీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తా. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయిస్తా. ఆదిమ గిరిజన తెగల కోసం కేంద్రం సీసీడీపీ ద్వారా వేలాది కోట్లను కేటాయిస్తుంది. కానీ గతంలో పనిచేసిన ఎంపీలు ఈ నిధులను రాబట్టడంలో విఫలమయ్యారు. కేంద్రంతో మాట్లాడి ఆ నిధులు తీసుకొచ్చి అభివృద్ధి జరిగేలా చూస్తా.

సాక్షి: ఏజెన్సీలో గిరిజనేతరులు భూ హక్కుల కోసం దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఎలా ముందుకెళ్తారు..?

సక్కు: వాస్తవానికి ఎలాంటి సమస్య లేదు. ఏజెన్సీ చట్టాల ప్రకారం ఆదివాసీలకే హక్కులు ఉంటాయి. కొంత మందికి పట్టాలు లేకపోవడంతో గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అందలేదు. అలాంటి వారికి లబ్ధి చేకూర్చేలా దళితబంధు, దళితబస్తీ, బీసీబంధు, మైనార్టీ బంధు పథకాల ద్వారా ప్రాధాన్యతనిచ్చి లబ్ధి చేకూర్చాం. సాంకేతిక కారణాలతో కొంత మంది ఇబ్బందులు పడుతున్నమాట వాస్తవమే. దీనిని పరిష్కరించేందుకు కృషి చేస్తా.

సాక్షి: ఈ ఎన్నికల్లో మీకు ప్రధాన పోటీదారుగా ఎవరిని భావిస్తారు..?

సక్కు: నాకు పోటీయే లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు నన్ను గెలిపిస్తాయి. కాంగ్రెస్ ఐదు నెలల పాలనలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదాన్నీ అమలు చేయలేదు. అలాంటప్పుడు ప్రజలు ఆ పార్టీకి ఎందుకు ఓటేస్తారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసినా ప్రజలకు ఎలాంటి మేలు చేయని మరో అభ్యర్థి తీరును ప్రజలు గుర్తించారు. దీంతో ప్రజల ఆదరణ నాకే ఉంది.

కల్యాణం.. కమనీయం



పట్టు వస్త్రాలు, తలంబ్రాలతో ఆలయానికి వస్తున్న వీడీసీ సభ్యులు



పుస్తెలు చూపుతున్న పూజారులు




కల్యాణంలో పాల్గొన్న దంపతులు, సంఘ సభ్యులు

లక్ష్మణచాంద: దక్షిణభారత దేశంలోనే ఏకైక అష్ట భుజాలు కలిగిన అష్టభుజ వేణుగోపాలస్వామి ఆలయం లక్ష్మణచాంద మండల కేంద్రంలో ఉంది. ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతోపాటు తాజామాజీ సర్పంచ్ ముత్యం రెడ్డి దంపతులు కూడా పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం పండితులు వేదమంత్రాలతో కల్యాణం జరిపించారు. తర్వాత భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వేడుకల్లో ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఎంపీటీసీ గడ్డం నర్సారెడ్డి, తాజా మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ రవికిరణ్, రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం..

నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి–గోవిందమ్మల కల్యాణం జంగం గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయం సమీపాన పందిరి వేసి హోమం, పూజాది, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు గిరిధర్, సతీశ్, సదానందం, గంగాధర్, నరేందర్, మహేందర్, సురేశ్, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



దస్తురాబాద్‌లో కొట్టుకుపోయిన ఇంటిపైకప్పు



దస్తురాబాద్‌లోని కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యం



దండుతండాలో ఎగిరిపోయిన ఇంటిపైకప్పు



విద్యుత్ తీగలు పరిశీలిస్తున్న ఎస్ఈ చౌహాన్

ఉట్నూర్‌రూరల్/దస్తురాబాద్: ఉట్నూర్ మండలంలో శుక్రవారం మధ్యాహ్నం గంట పాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలివాన బీభత్సానికి ఆదిలాబాద్–మంచిర్యాల ప్రధాన రహదారిపై ఇరువైపులా పాత ఉట్నూర్, నాగాపూర్ ప్రాంతాల్లో చెట్లు విరిగి పడ్డాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆ శాఖ జిల్లా అధికారి జేఆర్ చౌహాన్ విరిగిన స్తంభాలను పరిశీలించి త్వరితగతిన సరి చేసి కరెంట్ సరఫరా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే మండలంలోని దండుతండా గ్రామానికి చెందిన ధరంసింగ్‌తో పాటు పలువురు ఇళ్లపై రేకులు లేచిపోయాయి. దస్తురాబాద్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు తిప్పలు పడ్డారు. దస్తురాబాద్‌లోని కమ్మరివాడలో కుచనపెల్లి సురేశ్, మండలంలోని భూత్కూర్ గ్రామంలో సదాల పోశరాజం ఇంటి పైకప్పు రేకులు కొట్టుకుపోయాయి.